క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ

ములకలచెరువు: మండలంలోని సోంపల్లె ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ వెంకటరమణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం నాడు – నేడు పనులు నాణ్యత పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నలుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని బసినికొండ సమీపంలో కొందరు పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడిచేసినట్లు తెలిపారు. దాడుల్లో నిందితుల వద్ద నుంచి రూ.1,800 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముగ్గురిపై వేధింపుల కేసు

మదనపల్లె : వరకట్న వేధింపులతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన రాజశేఖర్ భార్య తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాధితురాలు తులసిని అత్తింటివారు గత కొద్దిరోజులుగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో తులసి ఫిర్యాదు చేయడంతో భర్త రాజశేఖర్ అతడి తల్లిదండ్రులు చలపతి, నాగరత్నలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫుట్‌బోర్డుపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ప్రైవేట్‌బస్సు ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ అదుపుతప్పి కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం జరిగింది. పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన కమాల్‌బాషా(56) భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా పోతబోలు పంచాయతీ బూచేపల్లెకు పనికి వెళ్లేందుకు ప్రైవేట్ బస్సు ఎక్కాడు. బస్సు ప్రయాణికులతో నిండిపోవడంతో ఫుట్‌బోర్డుపై నిల్చున్నాడు. మార్గమధ్యంలో తురకపల్లె వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శనకు ప్రతిభా పురస్కారం

పీలేరు : పట్టణానికి చెందిన శ్రీ నటరాజ కళామందిర్ నిర్వాహకురాలు పాగిరి హరిత కూచిపూడి నృత్యప్రదర్శనకు ప్రతిభాపురస్కార్ అవార్డు లభించింది. తిరుపతి శిల్పారామంలో వే ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో ఇండియన్ కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్యప్రదర్శనలో హరిత విశేష ప్రతిభ చూపారు. దీంతో ఆమెకు వే ఫౌండేషన్స్ అధ్యక్షుడు అంకయ్య చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

గుట్టకు నిప్పు

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలో ఉన్న నల్లగుట్టకు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నిప్పంటించారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే గుట్ట మొత్తం మంటల వ్యాపించడంతో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను కట్టడి చేశారు. కేర్‌లెస్ స్మోకింగ్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ అధికారి కృష్ణయ్య చెప్పారు. ప్రమాదంలో ఎటువంటి ఆస్తినష్టం జరగలేదు.

వీఆర్వోపై ఆర్డీఓకు ఫిర్యాదు

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె వీఆర్వో కృష్ణమూర్తి సర్వే విషయమై తమ వద్ద డబ్బులు తీసుకుని చలానా చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నాడని సోమవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళికి ఫిర్యాదు చేశారు. రెడ్డివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజుకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు శంకర తమ భూమి సర్వే చేయాలని వీఆర్వో కృష్ణమూర్తిని సంప్రదిస్తే తమ వద్ద నుంచి రూ.3,000 నగదు తీసుకుని త్వరలో చేయిస్తానని చెప్పాడన్నారు. అయితే రెండునెలలు కావస్తున్నా సర్వేకు అధికారులు రాకపోవడంతో సర్వేయర్‌ను విచారిస్తే చలానా కట్టలేదని, కడితే తాను వచ్చి భూమి కొలుస్తానని చెప్పాడన్నారు. వీఆర్వోను అడిగితే సమాధానం చెప్పకపోగా తప్పించుకుని తిరుగుతున్నాడన్నారు. తమ భూమిని కొలిపించి తనకు న్యాయం చేయాల్సిందిగా బాధితుడు ఆర్డీఓకు మొరపెట్టుకున్నాడు.

పక్కాగా మిషన్ అంత్యోదయ సర్వే

బి.కొత్తకోట: గ్రామాల్లో మిషన్ అంత్యోదయ సర్వే పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ శంకరయ్య కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామసచివాలయ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ సూచన మేరకు గ్రామాల్లో ఐదు అంశాలపై సర్వే నిర్వహించి యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో కార్యదర్శులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

గ్రైనేట్ వితరణ

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ పోతక్క పోలేమ్మ అమ్మవారి ఆలయానికి మైనార్టీ నాయకులు పఠాన్ ఖాదర్‌ఖాన్ గ్రైనేట్‌ను వితరణ చేశారు. ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.20 లక్షలు విలువ చేసే గ్రైనేట్‌ను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఖాదర్‌ఖాన్‌ను సన్మానించారు.

భక్తుల ఇలవేల్పు కలకడ సిద్దేశ్వరుడు

కలకడ : భక్తుల ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి వాసికెక్కారు. శివలింగ ప్రతిష్ట, ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 13వ శతాబ్దంలో వైడుంబరాజులు ఈ ఆలయాన్ని నిర్మించారని ఆధారాలు ఉన్నాయి. ఆలయ నిర్మాణానికి ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది. కడప జిల్లా సిద్దవటం మండపాన్ని పరిపాలించే చంద్రగుప్త మహారాజుకు చాలాకాలంగా సంతాన ప్రాప్తి కలగలేదు. ఎన్నో పూజలు, హోమాలు, నోములు చేసిన అనంతరం లేకలేక ఒక పుత్రిక కలిగింది. గారాబంగా పెంచిన కుమార్తె సత్యవతి యుక్తవయస్సుకు రాగానే భగవంతుని కృపతో వివాహం జరగకమునుపే గర్భం దాల్చింది. ఇది రాజుకు తలవంపుగా భావించి న్యాకోవిదుల సలహామేరకు రాజు కుమార్తెకు కఠిన పరీక్ష పెడతాడు. సత్యవతి శీలవతి అని నిరూపించుకోవడానికి తలంటు స్నానం ఆచరించి నాగుపామును చుట్టగా చుట్టి, నెత్తిపై పచ్చికుండలో కల్లు పోసి ఏడు పొలిమేరలు దాటి నిర్దోషిగా నిరూపించుకోవాలి. ప్రయాణించే దారిలో కుండపగిలినా, పాముకాటు వేసిన, నిలచినా దోషిగా భావించి శిరస్సును చేధించాలని రాజు భటులను ఆజ్ఞాపిస్తాడు. న్యాయ పండితుల ఆదేశం ప్రకారం రాజ భటులు వెంటరాగా బయలు దేరిన సత్యవతి శేషాచలం కొండల మీదుగా కాలినడకన కలకడ సమీపంలోకి రాగానే సత్యవతికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో కల్లు కడవ దించగానే ఆమె కడుపులోని గర్భం మాయమై కడవలో శివలింగం ఉద్భవించింది. తలపాగగా ఉన్న పాము తూర్పు దిక్కుకు వెళ్ళినట్లు, సత్యవతి పాదం మోపిన చోటుకు సత్యవతి నదిగాను, కల్లు కడవలో శివలింగం ఉద్భవించినందున కల్లుఘటగాను పేరు పెట్టారు. వైడుంబరాజులు ఈ ఆలయంలో శివలింగం ప్రతిష్టించి, ఆలయ నిర్మాణం చేపట్టినట్లు ప్రతీతి. అప్పటినుంచి మాఘమాసంలో ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తారు.


శ్రీకామాక్షి సిద్దేశ్వరస్వామి ఆలయం(ఇన్‌సెట్‌లో) సిద్దేశ్వరస్వామి

కలకడగా పేరు..

కల్లుకుండలో శివలింగం ఉద్భవించడంతో కల్లుఘట, కల్లుగట, కలకట, పేరును కాలక్రమేణా రూపాంతరం చెంది కలకడగా పిలువబడుతోంది. ఆనాటినుంచి నేటి వరకూ ప్రతి ఏడాది శివరాత్రి పర్వదినాన బ్రహ్మోత్సవాలు నిర్వహించి స్వామివారికి వాహన సేవలు నిర్వహిస్తారు.

శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామికి పూజలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజావరోహణం అనంతరం కలకడ పురవీధులలో శ్రీకామాక్షిసమేత సిద్దేదశ్వరస్వామి వారు పల్లకీలో ఇంటింటి పూజలు అందుకున్నారు. మొదటి రోజు స్వామి వారి పల్లకీని మోయడానికి భక్తులు ఉత్సాహం చూపారు. 11 రోజులు పాటు స్వామి వారు కలకడ పురవీధులలో భక్తులకు దర్శనమిస్తారు. అనంతరం ఆలయ ప్రవేశం చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



శివరాత్రికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: మహాశివరాత్రి పురస్కరించుకుని తంబళ్లపల్లెలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక డిపో కార్యాలయంలో శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ మదనపల్లె– మల్లయ్యకొండ కిందకు 15 బస్సులు, తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండ కిందకు 5 బస్సులు, మల్లయ్యకొండ కిందకు, మల్లయ్యకొండ పైకి 20 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. కురబలకోట మండలం అంగళ్లు మల్లయ్యకొండకు 8 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. సాధారణ చార్జీలతో బస్సులు నడపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

ఎస్‌ఈబీ దాడుల్లో సారాఊట ధ్వంసం

మదనపల్లె : ఎస్‌ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఈఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 2,000 లీటర్ల సారాఊట ధ్వంసం చేయడంతో పాటు, 10 లీటర్ల నాటుసారా, 14 లీటర్ల బ్రాందీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం నాటుసారా రవాణా కేసులో పట్టుబడిన వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన కుక్కలగంగులప్ప ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం నిమ్మనపల్లె మండలం సామకోటవారిపల్లెలో దాడులు నిర్వహించామన్నారు. గ్రామానికి తూర్పుదిక్కున అటవీప్రాంతంలో ఏడు డ్రమ్ముల నిండుగా నాటుసారా తయారీకి పనికివచ్చే 1,400 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. అలాగే వాల్మీకిపురం మండలం ఎర్రగుంట్లబావి గ్రామానికి తూర్పున అటవీప్రాంతంలో మూడు డ్రమ్ములు నిండుగా 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. కుక్కల గంగులప్పను మదనపల్లె కోర్టులో హాజరుపరిస్తే 14రోజులు రిమాండ్ విధించారన్నారు. వీటితోపాటుగా సోమవారం ఉదయం అమ్మచెరువుమిట్ట గ్రామసమీపంలో దాడులు నిర్వహిస్తే.. అక్రమంగా నాటుసారా కలిగిఉన్న బండిరెడ్డెమ్మను అరెస్ట్‌చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిస్తే న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారన్నారు. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ చీకలబైలు ఎస్‌ఈబీ చెక్‌పోస్టు వద్ద తప్పించుని వచ్చిన ఓ నిందితుడిపై సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు నక్కలదిన్నె ఆర్చ్‌వద్ద తనిఖీ చేయగా సీటీఎం మండలం గంగాపురం గ్రామానికి చెందిన సునీల్‌కుమార్ సుజుకి యాక్సిస్ ద్విచక్రవాహనం, 14 లీటర్ల ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ బాటిళ్లను వదిలి పారిపోయాడన్నారు. దీంతో బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకుని సునీల్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు.


బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : పట్టణంలోని బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం. సుధాకరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థులకు కామర్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులు బోధించుటకు అనుభవం, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 18లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 20న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూతో పాటుగా డెమో తరగతులకు హాజరుకావాలన్నారు. పీజీ కోర్సులో 55శాతం మార్కులతో పాటు ఎంఫిల్, పీహెచ్‌డీ, యుజీసీ నెట్ లేదా ఏపీసెట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాల పనివేళల్లో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రైవేట్ క్లినిక్‌లు నిబంధనలకు లోబడి నిర్వహించాలి

కేవీపల్లె : ప్రైవేట్ మెడికల్ క్లినిక్‌లు నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్యామల అన్నారు. సోమవారం మండలంలోని గర్నిమిట్టలో ప్రైవేట్ మెడికల్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లినిక్ నేమ్ బోర్డులో ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే నమోదు చేయాలన్నారు. ప్రాక్టీస్ చేసిన వారి పేరు ముందు డాక్టర్ అనే పదం వాడరాదన్నారు. క్లినిక్‌లో ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. మిగిలిన కేసులు ప్రభుత్వాస్పత్రికి పంపించాలని తెలిపారు. బెడ్స్ ఏర్పాటు చేయడం, ఐ.వి. ఫ్లూయిడ్స్ ఎక్కించడం, ఇంజెక్షన్లు వేయడం, అనధికారికంగా మందులు వాడడం చేయరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, ఆరోగ్య సిబ్బంది కృష్ణమ్మ, కృష్ణయ్య, పురుషోత్తం, చెన్నమ్మ, రెడ్డిలక్ష్మీ పాల్గొన్నారు.


ప్రైవేట్ మెడికల్ క్లినిక్ నిర్వాహకులకు సూచనలిస్తున్న డాక్టర్ శ్యామల

డీఎస్సీ 98 అభ్యర్థులు ఆందోళన చెందవద్దు

మదనపల్లె : డీఎస్సీ 98 అభ్యర్థుల చిరకాల కోరికను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 8న మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన 4,534 పోస్టులకు ఆమోదం తెలిపింది. త్వరలో జీఓ వెలువడనుందని, దీనిపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని మదనపల్లె డివిజన్ అధ్యక్షులు ఏ.ఆర్. నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డీఎస్సీ 98 అభ్యర్థుల పోస్టింగ్‌కు సంబంధించి ఇటీవల అనేక వాట్సాప్ గ్రూపుల్లో, సామాజిక మాధ్యమాల్లో 60–62 ఏళ్ల వయస్సు కలిగిన వారికి ఉద్యోగాలు ఇవ్వరనే వదంతులు ప్రచారమవుతున్నాయన్నారు. సీఎం హామీ మేరకు అందరికీ మంచి జరుగుతుందని విశ్వసించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ సభ్యులు టి.వి.శేషశయన్, టి.కృష్ణారెడ్డి, జమాల్‌బాషా, గీతశ్రీ, డి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శివరాత్రి ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 17న అంకురార్పణ, ధ్వజారోహణం,కలశ ప్రతిష్ట, 18న స్వామి వారికి మహా రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, రాత్రికి కళ్యాణోత్సవం, 19న బ్రహ్మ రథోత్సవం, 20న పార్వేటోత్సవం, అన్నమయ్య సంకీర్తనలు, 21న వసంతోత్సవం, శయనోత్సవం 22న స్వామి వారి విశ్వరూప దర్శనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. రథోత్సవానికి రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని ఆలయ. ధర్మకర్త ఆంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం: జగనన్న పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ మహమూద్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం సాంబశివతో కలసి మండలంలోని బూర్లపల్లి, నవాబుకోట పరిధుల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయం సిబ్బందితో సమీక్షించారు. నిర్మాణ దశలను బట్టి పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులను అప్‌లోడ్‌చేసి పనుల వేగవంతానికి కృషి చేయాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కలకడ : మండలంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన సోమవారం చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి కె.బాటవారిపల్లె వద్ద చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లెకు చెందిన మహేష్, దామోదర్, శివలు ద్విచక్రవాహంలో వెళుతుండగా, కెవిపల్లె మండలం పారకాయలపేట గ్రామానికి చెందిన మోహన్ తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తాం

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నియోజకవర్గ అధ్యక్షుడు, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఏపీజీఈఏ సభ్యులు సమావేశమయ్యారు. గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగస్తులకు ప్రతి నెలా ఒకటో తేదీకే జీతాల చట్టం అమలు తేవాలని, ప్రభుత్వం వద్ద ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, జీపీఎఫ్ నిధులను రాష్ట్ర ఉద్యోగుల సంఘం అనుమతులతోనే విత్ డ్రా చేయాలన్నారు. సమావేశంలో ట్రెజరర్ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరి సాంబశివ, అసోసియేట్ ప్రెసిడెంట్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై పూజలు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి, ఈవో రమణల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

స్పందన సమస్యలకు తక్షణమే పరిష్కారం

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కారం దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. సోమవారం ఉదయం స్పందన కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ డివిజన్‌లోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సమస్యలను సావధానంగా తెలుసుకుని, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలోని ఎస్సీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మూడేళ్లుగా అమలుకాని 26 పథకాలను వెంటనే పునరుద్ధరించి సొంత పూచీకత్తుపై ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలని భారతీయ జనతా దళితమోర్చా, రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులి నరేంద్రకుమార్‌రెడ్డి, నానబాలలక్ష్మణకుమార్, అడపామల్లికార్జున, భగవాన్ తదితరులు పాల్గొన్నారు. పెంచుపాడు గ్రామం పాశంవారిపల్లెకు చెందిన కోటూరి వెంకటరమణ తమ అనుభవంలోని భూమిని ఇతరులు ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని, సర్వే చేయాల్సిందిగా రెండుసార్లు చలానా కట్టినా సర్వేయర్ రావడం లేదని ఫిర్యాదు చేశాడు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో ఆర్.ఆర్.ఎన్ కాలనీలో కుక్కలు, పందుల సమస్య అధికంగా ఉందని ఫిర్యాదు అందింది.


స్పందనలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

నేడు శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమీక్ష

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని ప్రముఖ శైవాలయాల వద్ద భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ఏర్పాట్ల నిర్వహణపై మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఎం.ఎస్.మురళి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని మల్లికార్జునస్వామి దేవాలయం, తంబళ్లపల్లె, చిప్పిలి యోగభోగేశ్వరస్వామి దేవస్థానం, తవళం నేలమల్లేశ్వరస్వామి దేవస్థానం, కదిరినాథునికోట కనుగొండరాయునిస్వామి దేవస్థానం, సోమేశ్వరస్వామి దేవాలయం, మదనపల్లె, అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం, కలికిరి తదితర దేవాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లు, నిర్వహణపై సమీక్షా నిర్వహిస్తామన్నారు. సమావేశానికి దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ, రెవెన్యూ, ఎంపీడీఓ, , పోలీస్, ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు, వలంటీర్ ఆర్గనైజేషన్స్ హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పీలేరు : వేసవికాలం సమీస్తుండడంతో పీలేరు పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు, వాటర్‌మెన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సమీస్తోందని, ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా, నీటిని వృధా కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గేటువాల్వ్, పైపులైన్లు, మోటార్ల రిపేర్లు ఎప్పటికప్పుడు చేపట్టి, నాలుగు రోజులకోసారి తాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓ రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె : జిల్లాలోని భవననిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మొటుకు రమణ, బాబు, బెల్లంశ్రీనివాసులు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవననిర్మాణ కార్మికులు కరోనా, ఇసుక కొరతతో జీవనోపాధి కోల్పోయారన్నారు. ఆరునెలలుగా కార్మికుల కుటుంబాలకు రూ.10వేలు జీవనభృతి ఇవ్వాలని కోరుతున్నా రాష్ట్రప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్.17ను తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. భవననిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరుచేయాలని, 55 సంవత్సరాలు నిండిన వారికి రూ.3వేలు పెన్షన్, పనిముట్లు ఇవ్వాలన్నారు. బి.కొత్తకోటలో కార్పెంటర్లు, పెయింటర్లకు ప్రభుత్వమే రూములు నిర్మించి అప్పజెప్పాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కృష్ణప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మనోహర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లాసహాయ కార్యదర్శి సురేష్‌కుమార్, దేవ, తిరుమల, బిల్డింగ్‌వర్కర్స్ యూనియన్ నాయకులు సలీంబాషా, మోదీన్‌బాషా, తంబయ్యశెట్టి, బాబు, బెల్లంశ్రీనివాసులు, రవి,వాసు, నాగేశ్వర, మురళి, వెంకటరాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తైక్వాండోలో కేజీబీవీ విద్యార్థుల సత్తా

కురబలకోట: తైక్వాండో పోటీల్లో మండలంలోని ముదివేడు వద్ద గల కేజీబీవీ స్కూల్ విద్యార్థినులు పతకాల పంట పండించారు. మదనపల్లె జడ్పీ హైస్కూల్‌లో ఏపీఎస్‌యుఎఫ్ ఎస్‌జీఓ నిర్వహించిన పోటీలలో ఏడుగురు విద్యార్థినులు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రఫియా పర్వీన్ తెలిపారు. పి. స్రవంతి, కె.జ్యోత్నలత, పి.భవ్య, సి. కీర్తి, కె.శోభారాణి, టి. లిఖితశ్రీ, టి.నందిని పాల్గొన్నారని తెలిపారు. వీరు ఐదు బంగారు, రెండు వెండి మెడల్స్ సాధించినట్లు తెలిపారు.


పతకాలు సాధించిన విద్యార్థినులు

నేషనల్ బాస్కెట్ బాల్ పోటీలకు జునైద్ ఎంపిక

వాల్మీకిపురం: పట్టణంలోని తోటవీధికి చెందిన జునైద్ స్థానిక సీఎస్‌ఆర్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్నాడు. ఫిబ్రవరి 3వ తేదీన నూజివీడులో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి అండర్ 14 బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాస్కెట్ బాల్ జట్టు తరపున ఎంపికైన జునైద్ జాతీయ స్థాయిలో సైతం రాణిస్తాడని బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి ఆకాంక్షించారు. జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ అండర్ 14 పోటీల్లో జునైద్ ఎంపికపట్ల కోచ్ ఆంజిబాబు, సీనియర్ క్రీడాకారులు సుబ్రమణ్యం, రవి చందర్, సాయిభార్గవ్, శ్రీనివాస్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, హెచ్‌ఎం ఎఎస్‌ఎన్ కుమార్ అభినందించారు.



యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

పీలేరు రూరల్ : యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు లోకనాథరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కావలిపల్లె పంచాయతీ ఒంటిల్లు వద్ద రడవీర గంగమ్మ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీపడుతున్నాయని, నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ ఉంటుందని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి 15 వేలు తోపాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆప్ ది మ్యాచ్ బహుమతులు కూడా ఉంటాయని చెప్పారు. క్రీడాకారులు గెలుపోటములు సమంగా తీసుకుని క్రీడా స్ఫూర్తి కబరచాలన్నారు. కార్యక్రమంలో అశోక్, ప్రకాష్, మోహన్, సైషావలి, సద్దాం, రామానాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

కలకడ : ఝురి మహోత్సవంలో ప్రమాదాల నివారణకు అన్నిశాఖల అధికారులు, భక్తులు సహకరించాలని సీఐ నాగేంద్ర కోరారు. సోమవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝురిలో భక్తులు ఆచరించే పుణ్యస్నానాలకు దారి, సౌకర్యాలను సర్పంచ్ విశ్వనాథ్‌తో కలసి సీఐ పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా కలకడ, కేవీ మండలాల రోడ్డు మార్గంలో బస్సులు నిలుపు స్థలం, ఝురిలోకి రోడ్డు మార్గం, నీరు అధికంగా నిల్వ, ప్రవాహం ఉండటంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ తిప్పేస్వామికి సూచించారు. భక్తులకు కల్పించే ఏర్పాటు, అన్నదానం చేసేవారికి కేటాయించే స్థలాలను ఎంపీడీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య, రెవెన్యూశాఖ అధికారులు సమన్వయంతో భక్తులకు సమస్యలు లేకుండా చూడటానికి సహకరించాలని కోరారు.


ఝురి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ నాగేంద్ర, తదితరులు